రేపు మినీ జాబ్‌మేళా

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన డిగ్రీ నుంచి పిజి వరకు విద్యార్హత కలిగి 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు గల నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా ఈ నెల 18న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభి వృద్ధి సంస్థ అధికారి యు.సాయికుమార్ ఒక ప్రకటనతో తెలిపారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఉదయం 9 గటంల నుంచి ఎంపికలను చేపడుతున్నామని అన్నారు. మిరాకిల్ సాఫ్ట్‌వేర్, టెక్ తమ్మిన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ మూడు కంపెనీల ప్రతినిధులు హాజరు కానున్నట్టు తెలిపారు. నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అర్హత కలిగిన నిరుద్యోగ యువత వారి విద్యార్హత పత్రాలు జిరాక్స్ కాపీలతో పాటు ఆధార్, 3 బయోడేటా పత్రాలు, 2 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9550967353, 9704960160 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

'సుడి'దోమ చుట్టేస్తోంది...

ఆరుగాలం కష్టపడి పండించిన పంట దోమపోటు గురై సుడులు తిరుగుతోంది. పొట్ట దశలో పట్టుకున్న ఈ దోమ మండలంలో వందలాది ఎకరాల్లో పంటను కబలిస్తోంది. ముఖ్యంగా దోమపోటు ఉన్న పంటచేలు మొదలు పసుపు రంగులోకి మారి సుడులు తిరుగుతున్నాయి. దీంతో ఏం చేయాలో తెలియక రైతులు దిక్కుతోచని స్థితిలో స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించి నివారణ చర్యలు చేపడుతున్నారు.

- వరి పైరుకు దోమపోటు
- ఆందోళనలో రైతన్నలు
- సమగ్ర యాజమాన్యంతో నివారణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

సుడిదోమ ఆశించిన వరి పంట

ఇటీవల కాలంలో మండలంలో అన్ని ప్రాంతాల్లో సుడిదోమ తాకిడి పెరిగింది. సుడిదోమను తట్టుకునే రకాలైన స్వర్ణ (ఎంటియు 7029), సాంబ మసూరి (బిపిటి 5204) ఇతర ప్రయివేటు వరి వంగడాలు సాగు చేస్తున్న రైతులు దోమ ఉధృతిని గమనించగా వరి పైరును ఆశించే పురుగులు ఎక్కువ నష్టాన్ని కలుగజేసింది. మండలంలో కలివరం, తొగరం, దూసి, శ్రీనివాసచార్యులపేట, రామచంద్రాపురం, దండేవలస, నెల్లిపర్తి గ్రామాల్లో సుడిదోమ వ్యాపించింది. ఈ సుడిదోమ వల్ల కలిగే నష్టం దాని నివారణకు తీసుకోవాల్సిన సూచనలు రైతులు తెలుసుకోవాలి. వరి పంటను రెండు రకాల దోమలు ఆశించి నష్టపరుస్తాయి. అవి గోధుమ వర్ణపు దోమ, తెల్లవీపు మచ్చ దోమ. గోధుమ వర్ణపు దోమ సంవత్సరం పొడుగునా ఆశిస్తాయి. దీని ఉధృతి సార్వా పంటలైన అక్టోబర్, నవంబరు నెలలో ధార్వా పంటలైన మార్చి, ఏప్రిల్ నెలలో ఎక్కువగా ఆశిస్తాయి.

పురుగు ఆశిస్తే లక్షణాలు

గోధుమ వర్ణపు దోమ నీటి వసతి గల ప్రాంతాల్లో పంట అంకురార్పణ దశ నుంచి ఎక్కువగా ఆశిస్తుంది. పిల్ల, తల్లి దోమలు నీటి పైభాగాన దుబ్బులు మొదల దగ్గర నుంచి పోషకాలు సరఫరా చేసే కణజాలం నుంచి రసాన్ని పీల్చడం వల్ల మొక్కలు మొదట పసుపు రంగుకు మారి క్రమేపీ పైరు సుడులు సుడులుగా ఎండిపోతుంది. ఈ విధంగా పొలంలో మొక్కలు ఎండిపోవడాన్ని సుడి తెగులు అని పిలుస్తారు.

సుడిదోమ యాజమాన్యంలో భాగంగా రైతు సోదరులు కొన్ని చేయకూడని అంశాలు ఉన్నాయి. సుడిదోమ ఉధృతికి దోహదపడే పురుగు మందులు ప్రోఫెనోఫాస్ సైపరమిద్రిన్ డెల్టా మిద్రిన్ ట్రైజోఫాస్, ఫోరట్ 10జి గుళికలు వాడరాదు. వివిధ రకాల పురుగు మందుల మిశ్రమాన్ని విచక్షణారహితంగా వాడరాదు. పురుగు మందులతో పాటు ఎటువంటి పోషకాల మిశ్రమాలు జీవన్ నియంత్రకాలను కలిపి పిచికారీ చేయరాదు. నత్రజని ఇచ్చే అధిక రసాయనక ఎరువులు వినియోగించరాదు.

గోధుమ వర్ణపు దోమ

గోధుమ వర్ణపు దోమ నీటి వసతి గల ప్రాంతాల్లో పంట అంకురార్పణ దశ నుంచి ఎక్కువగా ఆశిస్తుంది. తల్లి పురుగుల్లో రెండు రూపాంతరాలు ఉంటాయి. అవి పొడుగాటి రెక్కలుగలవి (మాక్రో ప్టెరస్) పొట్టి రెక్కలు గలవి ఇందులో పొడగాటి రెక్కలు గలవి, వలస పోగల శక్తి కలిగి కొత్త ఆవాసాలను ఏర్పాటు చేసుకుంటాయి. ఈ దోమలు గుడ్ల సముదాయాలను (2-12 గుడ్లను) కాండం ఒరలలో కాండం కణజాలంలో చూపిస్తాయి. ఇవి ఒకదానిలో ఒకటి అతుక్కుని ఉంటాయి. పొట్టి రెక్కలు గల ఆడ దోమలు 300- 350 వరకు గుడ్లు పెడతాయి. ఈ గుడ్లు ఆరు నుంచి తొమ్మిది రోజుల్లో పొదగబడి గుడ్ల నుంచి వెలువడిన పిల్ల పురుగులు తెలుపు రంగులో ఉండి ఐదు దశల్లో పెరిగి 10 నుంచి 18 రోజుల్లో గోధుమ వర్ణంలోకి మారుతాయి. ఈ దోమలు తమ జీవిత కాలాన్ని 12 నుంచి 23 రోజుల్లో పూర్తి చేసుకుంటాయి.

సుడి దోమ నివారణ ఇలా...

పొలాన్ని అడపాదడపా ఆరబెట్టాలి. నత్రజని ఎరువులను సిఫార్సు మేరకే వాడాలి. ఆర్థిక నష్ట సహన పరిమితి స్థాయికి దోమ ఉధృతి ఉన్న ఎడల దాని స్థాయిని అనుసరించి సూచించిన పురుగు మందులను పిచికారీ చేసుకోవాలి. పిలక దశలో దుబ్బుకు 10 నుంచి 15 దోమలు ఈనిక దశలో దుబ్బుకు 20 నుంచి 25 దోమలు, ఆర్థిక నష్ట సహన పరిమితి స్థాయికి దోమ ఉధృతి ఉన్న ఎడల దాని స్థాయి అనుసరించి సూచించిన పురుగు మందులు పిచికారీ చేసుకోవాలి. దోమ ఉధృతి దుబ్బుకు 50 నుంచి 100 వరకు ఉన్న ఏసిఫేట్ 75 ఎస్‌పి 1.5 గ్రాములు లేక ఇమిడాక్లోప్రిడ్ ఏద్రిపోల్ 80 డబ్ల్యూజి 0.25 గ్రాములు లేక బ్రూఫో ఫేజిన్ 1.6 మిల్లీలీటర్లు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి. దోమ ఉధృతి దుబ్బుకు 100 నుంచి 150 వరకు ఉంటే ఫ్లోనికామిడ్ 50 ఎస్‌జి 0.4 గ్రాములు డైనటో ఫ్యూరాన్ 20 ఎస్‌జి 0.4 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. దోమ ఉధృతి దుబ్బుకు 150కు పైబడి ఉంటే పైమెట్రో జెన్ 50 డబ్ల్యూజి 0.6 గ్రాములు ట్రైఫ్లూమిజో ఫైరిమ్ 10 ఎస్‌జి 0.48 మిల్లీ లేటరు నీటి కలిపి పిచికారీ చేయాలని కృషి విజ్ఞాన శాస్త్రవేత్తలు తెలిపారు.

అవగాహన కల్పిస్తున్నాం

మండలంలో పంట విస్తీర్ణం 11 వేల ఎకరాలకు పైబడి సాగులో ఉంది. సుడిదోమ ఆశించిన పంట విస్తీర్ణం సుమారు 400 ఎకరాలకు పైబడి ఉంది. సుడి దోమ పంట పొలాల రైతులకు అవగాహన కల్పించి నష్టనివారణ చర్యలు చేపడుతున్నాం.

– మెట్ట మోహనరావు, ఎఒ

మాట్లాడుతున్న ఎం.వి.ఎస్ శర్మ

ప్రభుత్వ రంగాలు నిర్వీర్యానికి కుట్ర

పూర్వ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశంలో ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను అడ్డుకునేందుకు ఐక్య పోరాటాలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఉత్తరాంధ్ర పట్టభద్రుల పూర్వ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ అన్నారు. నగరంలోని ఎన్‌జిఒ హోమ్‌లో బ్యాంకు ఎంప్లాయీస్ ఫెడరేషన్ అఫ్ ఇండియా 43వ వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం బ్యాంకు ఉద్యోగుల సంఘ నాయకుడు మండ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ప్రధాన వక్తగా పాల్గొన్న శర్మ మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వ విధానాలను సోదాహరణంగా వివరించారు. ఎల్ఐసి, రైల్వే, పోర్టులు, బ్యాంకింగ్, విశాఖ స్టీల్‌ప్లాంటు వంటి బారీ పరిశ్రమల్లో వాటాలుగా విభజించి ప్రయివేటు రంగాన్ని వాటిలోకి చొరబాటుకు మార్గాలను కల్పించారన్నారు. ఇప్పుడు ఒక్కొటిగా ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ... దేశంలో కార్పొరేటు దిగ్గజాలుగా ఉన్న అంబానీ, ఆదానీలకు కట్టబెడుతున్నారన్నారు. వాటికి పరిష్కారించుకునేందుకు ట్రేడ్ యూనియన్‌లు ముందుండి ఐక్య పోరాటాలు సాగించాలన్నారు.

యుఎఫ్‌బియు స్థాపించడంలో బిఇఎఫ్ఐ పాత్ర కీలకమైెందన్నారు. శ్రీనివాసరావు సంఘటిత పోరాటాల్లో అందరు మమేకమై ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. ఎఐబిఇఎ నాయకులు శ్రావణి, శ్రామిక మహిళా కన్వీనర్ కె.నాగమణి, పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు గణపతిరావు మహిళల సమస్యలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఎపిజివిబి యకులు బి.పి.ఎస్.రావు, ఎల్ఐసి ఉద్యోగులు, బ్యాంకు ఉద్యోగ అధికారులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. అంతకుముందు కీర్తిశేసులు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

మౌలిక సదుపాయాల కల్పనతోనే అభివృద్ధి

- 3071 పనులకు రూ.261 కోట్లు మంజూరు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- సారవకోట

ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే ముందుగా మౌలిక సదుపాయాలు ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. మండలంలోని అర్లి నుంచి గోవర్ధనపురం వరకు బిటి, సిసి రోడ్డు పనులకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, టెక్కలి ఆర్‌డిఒ కృష్ణమూర్తిలతో కలసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోవర్ధనపురం నుంచి అర్లి గ్రామాల మధ్యలో రూ.1.82 కోట్లతో 2.80 కిలో మీటర్ల బిటి, సిసి రోడ్డుకు పల్లె పండగలో భాగంగా శంకుస్థాపన చేశామన్నారు. రోడ్ల తర్వాత ఆరోగ్య కేంద్రాలు, తదితరమైనవి వస్తాయని పేర్కొన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో రూ.261 కోట్లతో 3071 పనులు మంజూరు చేశామన్నారు. మరిన్ని పనులు మంజూరు చేస్తామమని తెలిపారు. నరసన్నపేట నియోజకవర్గంలో రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. తాగునీటి పనులకు సాంకేతిక సమస్య వల్ల ఆగిందని, అదీ త్వరలో పూర్తవుతుందని అన్నారు. రోడ్డు ఏర్పాటుకు ఇద్దరు దాతలు భూమి ఇచ్చి సహకరించినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే మన గ్రామాన్ని, మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని తాగునీటి సమస్య ఉందని, నీటి సమస్య లేకుండా వంశధార రిజర్వాయరు నుంచి నీటిని తీసుకొచ్చేందుకు కృషి చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ ప్రాంతంలో రైతులకు ఉపయోగపడే పనులను ముఖ్యమంత్రి, జిల్లాలోని కేంద్ర, రాష్ట్ర మంత్రులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో మండల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వరరెడ్డి

అంతర్రాష్ట్ర చైన్‌స్నాచర్ అరెస్టు

- ఆరున్నర తులాల బంగారం, బైక్ స్వాధీనం
- ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

చెడు వ్యసనాలతో పాటు జల్సాలకు అలవాటు పడి ఒంటరి మహిళల మెడలో బంగారు గొలుసులను కొట్టేసిన అంతర్రాష్ట్ర చైన్ స్నాచర్ చిన్మయ ప్రదాన్‌ను ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. జిల్లా వ్యాప్తంగా నాలుగు పోలీసుస్టేషన్ల పరిధిలో ఒకరోజు నాలుగు చైన్ స్నాచింగ్ చోరాలకు పాల్పడ్డ కేసుల్లో ప్రదాన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి బుధవారం విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలోని ఈ నెల 1న వజ్రపుకొత్తూరు, కాశీబుగ్గ, బారువ, కంచిలి పోలీస్ స్టేషన్ పరిధిలో గంటల వ్యవధిలో చైన్ స్నాచింగ్ నేరాలకు పాల్పడిన నిందితుడు ఒడిశా రాష్ట్రం జైపూర్ జిల్లా ముండమల్‌కు చెందిన చిన్మయ ప్రదాన్‌గా గుర్తించామన్నారు. అతని వద్ద సుమారు రూ.4.87 లక్షల విలువ గల ఆరున్నర తులాల బంగారు నగలతో పాటు పల్సర్ బైక్‌ను స్వాధీన పరచుకున్నట్టు వివరించారు. జిల్లాలోని కంచిలి మండలం మఖరాంపురం కూడలి సమీపాన సుజల వాటర్ ప్రాజెక్టు వద్ద స్కూటీపై ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళలను వెంబడించిన చిన్మయ ప్రదాన్, బిజయ్ ప్రదాన్‌లు వెనుక కూర్చున్న మహిళ మెడలో బంగారు పుస్తెలుతాడును తెంచుకుని బైక్‌పై పరారయ్యారని తెలిపారు. అదేరోజు బారువ పోలీసుస్టేషన్ పరిధిలోని కొర్లాం సమీపంలో మహిళ మెడలో పుస్తెతాడును, మళ్లీ అదేరోజు వజ్రపుకొత్తూరు మండలం బెండి గేటు కూడలి వద్ద మరో మహిళ మెడలో బంగారు గొలుసును తెంచుకుని పారిపోయాడని చెప్పారు. ఈ చోరీలకు పాల్పడిన వెంటనే నిందితులు అదే ముఠాలో సభ్యులైన సంతోష్ ప్రదాన్, సంజయ్ ప్రదాన్‌లకు దొంగలించిన బంగారు వస్తువులు అప్పగించి వారి వద్ద సిద్ధంగా ఉన్న బట్టలను మార్గంమధ్య లో మార్చుకుంటూ ఒకే రోజు నాలుగు చోరీలకు పాల్పడ్డారని వివరించారు. ఆ రోజు రాత్రి ఆ నగలను చిన్మయ్ ప్రదాన్‌కు తిరిగి అప్పగించిన తర్వాత వాటిని జాడుపూడి కూడలి దగ్గరలో ఉన్న బోలా శంఖర్ ధాబా వెనుక ఒక్కడే వెళ్లి గొయ్యి తీసి దాచి పెట్టారని అన్నారు. ఈనెల 15న దాచిపెట్టిన బంగారు వస్తువులను తీసుకునేందుకు వచ్చిన అతన్ని అనుమానించిన కంచిలి పోలీసులు అదుపులోకి ప్రశ్నించారని అతని వద్ద గల ఆరున్నర తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. ప్రధాన నిందితుడైన చిన్మయ్ ప్రదాన్ 15 ఏళ్ల వయసు నుంచి చోరీలకు పాల్పడుతున్నట్టు వివరించారు. 2020లో అతన్ని కోల్‌కత్తాలో గంజాయి రవాణా కేసులో అక్కడి పోలీసులు అరెస్టు చేశారన్నారు. నాలుగేళ్ల జైలు శిక్ష అనుభవించి ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదలై స్వగ్రామానికి చేరుకున్నాడన్నారు. తన తల్లి అనారోగ్యానికి చికిత్స నిమిత్తం అధిక మొత్తంలో డబ్బులు అవసరం కావడంతో అదే గ్రామానికే చెందిన సంతోష్ ప్రదాన్‌తో ఒంటరిగా ఉన్న మహిళల మెడలో నుంచి బంగారు చైన్లు, పుస్తెలతాడు లు తెంపడానికి పతకం వేశారని పేర్కొన్నారు. వీరికి బిజయ్ ప్రదాన్, సంజయ్ ప్రదాన్‌లు సహకారం అందించడంతో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డారని వెల్లడించారు. నలుగురు నిందితుల్లో మిగతా ముగ్గురిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. కాశీబుగ్గలో జరిగిన చోరీకి సంబంధించిన సొత్తును రికవరీ చేయాల్సి ఉందని చెప్పారు. కేసును ఛేదించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడంతో ఎక్కడిక్కడ గాలింపు ముమ్మరంగా చేశామన్నారు. ఈ కేసులను ఛేదించి నిందితుల ను పట్టుకోవడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన కాశీబుగ్గ రూరల్ సిఐ ఈశ్వరరావు, సోంపేట సర్కిల్ సిఐ బి.మంగరాజు, కంచిలి ఎస్ఐ జి.రాజేష్, వజ్రపుకొత్తూరు ఎస్ఐ నిహార్, హెడ్ కానిస్టేబుల్ గవరయ్య, పోలీస్ కానిస్టేబుళ్ల బషీర్, నీలకంఠం, రాధాకృష్ణ, శ్యామ్, షన్ముఖ, ప్రేంకుమార్‌లను ఎస్‌పి అభినందించారు.

నిరంతర పర్యవేక్షణలో సిసి కెమెరాలు

జిల్లాలో ఇప్పటివరకు నిక్షిప్తమైన సిసి కెమెరాలు పూర్తిగా పరిశీలించి, పనిచేయని సిసి కెమెరాలను మరమ్మతులు చేపట్టాలని ఎస్‌పి ఆదేశించారు. జిల్లాలోని నిర్మానుష్యమైన ప్రదేశాల్లో కొత్త సిసి కెమెరాలు ఏర్పాటు చేసి వాటి పర్యవేక్షణకు జిల్లా కేంద్రంలో కమాండ్ కంట్రోల్ రూమ్‌కి అనుసంధానం చేయాలన్నారు.

మాట్లాడుతున్న జిల్లా జడ్జి జూనైద్ అహ్మద్ మౌలానా

డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జూనైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం లీగల్ : రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ వారి ఆదేశాల మేరకు డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జూనైద్ అహ్మద్ మౌలానా అన్నారు. స్థానిక జిల్లా కోర్టు భవనంలో జిల్లా పోలీసు ఆధికారులతో, ఎక్సైజ్ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జైల్లో గల ముద్దాయిలపై నల్సా అందిస్తున్న సేవలు గురించి చర్చిస్తూ... త్వరితిగతన వారికి సాయం అందించే దిశగా లోక్ అదాలత్ కోర్టు పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎస్‌పి కె.వి.మహేశ్వరరెడ్డి, జడ్జిలు భాస్కరరావు, ఎం.ఫణికుమార్, జిల్లా కార్యదర్శి న్యాయ సేవాధికార సంస్థ ఆర్.సన్యాసినాయుడు, ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి కె.ఎల్.వి.హిమబిందు, పబ్లిక్ ప్రాసెక్యూటర్లు సిహెచ్.సత్యనారాయణ, నాగభూషణరావు పాల్గొన్నారు.

గాంధీ స్మారక స్థలిగా అభివృద్ధి

రైల్వే జిఎం పరమేశ్వర్ పంక్వార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని దూసి రైల్వేస్టేషన్‌ను మహాత్మా గాంధీ స్మారకస్థలిగా అభివృద్ధి చేస్తామని ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ పంక్వార్ అన్నారు. శ్రీకాకుళం రోడ్డుతో పాటు దూసి రైల్వే రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటాక్ అదనపు కన్వీనర్ వావిలపల్లి జగన్నాథ నాయుడు ఆధ్వర్యాన శ్రీకాకుళం ప్రతినిధి బృందం దూసి రైల్వేస్టేషన్‌లోని మహాత్మా గాంధీ అడుగుపెట్టిన దూసి రైల్వే స్టేషన్‌ను గాంధీజీ స్మారక స్థలిగా అభివృద్ధి చేయాలని కోరారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ పర్యటనలో భాగంగా దూసి రైల్వే స్టేషన్ సమీపంలో 1942 జూన్ 6న నాటిన మొక్కను (నేటి వృక్షాన్ని), అలాగే ఆరోజు గాంధీజీ ప్రసంగించిన స్థలాన్ని జనరల్ మేనేజర్‌కు చూపించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన పరమేశ్వర్ ఇంటాక్ ప్రతిపాదనలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే ఇంటాక్ ఆధ్వర్యాన చేసిన ప్రతిపాదన విశాఖపట్నం పరిధిలో పరిశీలనలో ఉన్నాయని, తప్పకుండా దూసి రైల్వే స్టేషన్ మహాత్మా గాంధీ స్మారకస్థలిగా అమలు చేయటానికి చర్యలు చేపట్టాలని డిఆర్‌ఎం సౌరవ్ ప్రసాద్‌ను ఆదేశించారు. జిఎంను కలిసిన వారిలో ఇంటాక్ సీనియర్ మెంబర్లు కొమ్ము రమణమూర్తి, పొన్నాడ రవికుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పరమేశ్వర్ పంక్వార్

నిధుల కేటాయింపులో అన్యాయం

బైఠాయించిన కౌన్సిలర్లు

ఇచ్ఛాపురం: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించకపో వడంతో అన్యాయం జరిగిందని 8వ వార్డు కౌన్సిలర్ మధుమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన బుధవారం కౌన్సెల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయింపులో వివక్షతపై ఇద్దరు కౌన్సిలర్లు చైర్‌పర్సన్ పోడియం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. తమ వార్డులకు నిధులు కేటాయింపులో న్యాయం జరగని పక్షంలో నిరాహార దీక్షకు సిద్ధమంటూ హెచ్చరించారు. వివిధ వార్డులకు రూ.48 లక్షలు 15వ ఆర్థిక సంఘం నిధులను తయారు చేసిన ఎజెండా ను ఆమోదించేందుకు చర్చ ప్రారంభించారు. ఈ సందర్భంగా 8వ వార్డు కౌన్సిలర్ పళ్లంటి మధుమూర్తి తన వార్డుకు నిధులు కేటాయించకపోవడంపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. తమ వార్డు ప్రజలు కూడా పన్నులు కడుతున్నారని, తమ వార్డులు అత్యధికంగా మైనార్టీలు ఉన్నారని వివరించారు. అధికారులను ప్రశ్నిస్తూనే కౌన్సిల్ హాల్లో నేలపై బైఠాయించారు. చాలా కాలంగా పూర్తిగా ధ్వంసమైన తన వార్డులోని మంగళవారంపేట రహదారి నిర్మాణానికి నిధులు అడుగుతున్నానని, అయినా పట్టించు కోవడం లేదని వాపోయారు. అన్ని వార్డులకూ సమానంగా నిధులు కేటాయించాలని కోరారు. 15 ఆర్థిక సంఘం రెండో విడత నిధుల్లో రూ.పది లక్షలు కేటాయిస్తామని చైర్‌పర్సన్, అధికారులు హామీనివ్వడంతో ఈ వ్యవహారం సద్దుమణిగింది. ఐదో వార్డు కౌన్సిలర్ నారాయణ బెహరా కూడా తన వార్డుకు నిధులు కేటాయించలేదని బైఠాయించారు. సమావేశంలో కౌన్సిలర్లు ప్రదీప్ సామ్యూల్, గేదెల శేఖర్ పాల్గొన్నారు.

ఇంటర్‌లో కొత్త విధానం

జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి తవిటినాయుడు

విద్యార్థులతో మాట్లాడుతున్న తవిటినాయుడు

వజ్రపుకొత్తూరు: ప్రభుత్వం ఇంటర్ విద్యలో కొత్త విధానం తీసుకొచ్చిందని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ఎస్.తవిటినాయుడు అన్నారు. మండలంలోని పూండిగోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కళాశాలలోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాలలో జరుగుతున్న పరీక్షలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ ఏడాది నుంచి కళాశాలను ఉదయం 9 నుంచి 5 వరకు తరగరాలు నిర్వహిస్తూ... స్టడీ అవర్స్, సైన్స్ ప్రయోగాలు బోధించారు. ప్రభుత్వం నుంచి పాఠ్యపుస్తకాలు, నోట్స్‌లు, బ్యాగులు అందజేశారు. ఇంటర్ షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరగాలని, అందరూ చక్కగా ప్రణాళికతో చదవాలని అన్నారు. విద్యార్థులు హాజరు శాతం ఎక్కువగా ఉండాలన్నారు. పాఠ్యాంశాల బోధన తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు ప్రిన్సిపాల్ రమేష్ పట్నాయక్, ఇన్‌ఛార్జి రమణమూర్తి, అధ్యాపకులు రూప్ సుందర్, తిరుపతిరావు, రమణ రాంబాబు, భాగ్యవతి, శోభారాణి, సౌజన్య ఉన్నారు.

గ్రామ పంచాయితీ కార్యాలయం - పొందూరు

రేఖా నెం : 52/2024 తే.15-10-2024 ది.

టెండరు ప్రకటన

శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం, పొందూరు గ్రామ పంచాయతి నకు ఈ దిగువ నుదహరించిన షెడ్యులు-1 నందు తెల్పిన సామాగ్రిని 2024-2025 సం॥ నందు సప్లై చేయుటకు గాను తే:24-10-2024ది ఉదయం గం.11-00 నుండి మద్యాహ్నాం గం.01-00 వరకు ఈ గ్రామ పంచాయతి కార్యాలయం వద్ద యీ దిగువ సంతకం దారునిచే గాని లేదా వారి అనుమతి పొందిన ఇతర ఉద్యోగిచే గాని సీలు వేసిన టెండర్లు స్వీకరించబడును. టెండర్ దారులు టెండర్ ధరావత్తు చెల్లించి, టెండర్ షరతులకు లోబడి మాత్రమే టెండర్లలో పాల్గొనవలెను. స్వీకరించబడిన టెండర్లను ఆదే రోజు మద్యాహ్నాం గం 02-00 లకు హాజరైన టెండరుదారుల సమక్షంలో తెరవబడును. టెండర్ల ను ఎట్టి కారణము చూపి గాని, చూపకుండా గాని, వాయిదా వేయుటకు గాని, తిరస్కరించుటకు గాని పూర్తి అధికారం యీ గ్రామ పంచాయతీ నకు మరియు అందులకు సంబందించిన అధికారులదై యుండును. పూర్తి షరతులు, షెడ్యులు-1 వివరములు మరియు ఇతర వివరములు కార్యాలయ పని వేళలయందు ఆడిగి తెలుసుకోవలెను.

సం/- మోహన్ బాబు, కార్యనిర్వహణాధికారి
(పంచాయతీ కార్యదర్శి) గ్రామ పంచాయతి, పొందూరు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
O. S 63/2023

Between:-
Kalla Ramanamma, ---Plaintiff
And:
Kalla Srinivasa Rao & others, ---Defendants
To,
D-2. Kalla Vasu Deva Rao, S/o late Venkateswara Rao, aged 57 years, Software employee, R/at Upstair, Plot No:25, 1st lane, Satya Sai Nagar Colony, Balaga, Srikakulam district.

ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా, పై నంబరుగల దావాలో మీకు నోటీసులు కోర్టు ద్వారా ఎన్నిసార్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున మీరు **తేదీ 28-10-2024 న ఉదయం: గం॥10-30 ని॥** లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ, ప్లీడరు గారి ద్వారా కానీ హాజరు కాబడి మీ వాదనలు తెలియజేసుకొనవలెను. లేనిచో సదరు దావా మీ పరోక్షమునందు తీర్మానించబడునని తెలియ జేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులను అనుసరించి)

కె.వి. రమణ
న్యాయవాది, శ్రీకాకుళం,
సెల్: 9391380955

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
I.A 310/2023 in O.S 63/2023

Between:-
Kalla Ramanamma, ---Petitioner/Plaintiff
And:
Kalla Srinivasa Rao & others, ---Respondents/Defendants
To,
R-2. Kalla Vasu Deva Rao, S/o late Venkateswara Rao, aged 57 years, Software employee, R/at Upstair, Plot No:25, 1st lane, Satya Sai Nagar Colony, Balaga, Srikakulam district.

ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా, పై నంబరుగల IA.310/2023in OS.63/2023 లో మీకు నోటీసులు కోర్టు ద్వారా ఎన్నిసార్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున మీరు **తేదీ 28-10-2024 న ఉదయం: గం॥10-30 ని॥** లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ, ప్లీడరు గారి ద్వారా కానీ హాజరు కాబడి మీ వాదనలు తెలియజేసుకొనవలెను. లేనిచో సదరు దావా మీ పరోక్షమునందు తీర్మానించబడునని తెలియ జేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులను అనుసరించి)

కె.వి. రమణ
న్యాయవాది, శ్రీకాకుళం,
సెల్: 9391380955

పల్లెల అభివృద్ధే 'పల్లె పండగ' లక్ష్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

పల్లెల అభివృద్ధే లక్ష్యంగా పల్లె పండుగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలంలోని ఇప్పిలి, కనుగులవానిపేట, కుందువానిపేట, బలివాడ ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమపై పెంచుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పల్లె ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. ఏ గ్రామంలో ఏ పనులు అవసరమో వాటిని పూర్తి చేసేందుకు అందుకు తగ్గ నిధులు కూడా విడుదల చేశామన్నారు. నియోజక వర్గంలో సిసిరోడ్లు, బిటి రోడ్లు, నీటి సంరక్షణ ట్రెంచులు, గోకులాలను పెద్దఎత్తున అన్ని గ్రామాల్లో నిర్మిస్తామన్నారు. ఉపాధి నిధులతో నియోజక వర్గంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ఎంపిడిఒలు, అధికారులు పాల్గొన్నారు.

బూర్జ: అభివృద్ధిని చూసి ఓర్వలేని వైసిపి నాయకులు దుష్ప్రచారాలు చేస్తున్నారని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్నంపేట, టిడిఆర్ రాజుపేట, కురుంపేటలో ఉపాధి హామీ నిధులతో చేపట్టనున్న సిమెంట్ రహదారులు, కాలువ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. టిడిఆర్ రాజుపేటలో సచివాల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయం సిబ్బంది సమయానికి రావడం లేదని సర్పంచ్ అంబజాక్షి రవికుమార్‌కు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్, మాజీ జెడ్‌పిటిసి ఆనెపు రామకృష్ణ నాయుడు, జనసేన నియోజకవర్గ నాయకులు రామ్మోహన్‌రావు, సీతబాబు, శ్రీరామనాయుడు, ఎంపిడిఒ తిరుపతిరావు, తహశీల్దార్ పద్మావతి, ఎపిఒ రాజకుమార్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: మండలంలోని గోనెపాడులో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా సిసి రహదారులు, కాలువల నిర్మాణ పనులకు ఎంపిడిఒ ఎం.పావని శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సర్పంచ్ బిర్లంగి అమ్మాయి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శివ్వాల సూర్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు అంబల్ల రాంబాబు, టిడిపి నాయకులు గోవిందరావు, ఎంపిటిసి మెట్ట రాము, కూన గణపతిరావు, అనంతరావు, రామచంద్రమూర్తి, వెంకటరమణ, మీసాల రామారావు, ఎంఎంఎస్ అధ్యక్షులు పేడాడ మణి, ఇఒపిఆర్‌డి రామారావు పాల్గొన్నారు.

పలాస : గ్రామాలు అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. మండలంలోని బ్రాహ్మణతర్లా, అమలకుడియా గ్రామాల్లో బుధవారం సిసి రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.

బూర్జ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

బ్రాహ్మణతర్లాకు రూ. 12.60 లక్షలు, అమలకుడియాకు రూ.16.90 లక్షలు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో పి.విఠల్‌రావు, దువ్వాడ సంతోష్‌కుమార్, బి.నాగరాజు, వడ్డీ యాదగిరి, ఆళ్ల వెంకటరావు, ఆళ్ల కృష్ణారావు, బి.ఆనందరావు, ఆర్.సుధాకర్, ఎంపిడిఒ వసంతరావు, పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని మర్రిపాడు-కె, ముక్తపురం, పట్టుపురం, మారడికోట, పరశురాంపురం గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణాలకు ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, మాజీ ఎంపిపి ఎస్.మోహనరావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి నంబాల వెంకటరావు, మాజీ సర్పంచ్ అగాల శ్రీనివాసరావు, చాపర మాధవరావు, ధర్మాన రమేష్, ఎపిఒ రవి, ఎపిఎం గోవిందమ్మ పాల్గొన్నారు.

చేప పిల్లలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

మత్స్యకారులకు అండ

ఎమ్మెల్యే అశోక్

ప్రజాశక్తి- కవిటి

కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు అండగా ఉంటుందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మత్స్యశాఖ కమిషనర్ విజయవాడ ఆదేశాల మేరకు చేప పిల్లల పెంపకంలో భాగంగా ప్రభుత్వం అందించే ఉచిత చేప పిల్లలను ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట పరిధిలోని స్వదేశీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇచ్ఛాపురం కేంద్రంగా కవిటి, సోంపేట పలాస, మందస మండలాల పరిధిలోని స్వదేశీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సభ్యులకు 1,41,800 చేప పిల్లలను అందించినట్టు తెలిపారు. వీటి ద్వారా వారు స్వయం ఉపాధి పొంది, ఆర్థిక స్థిరత్వం సాధించేలా ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ మురళీమోహనరావు, ఎంపిడిఒ శ్రీనివాస్‌రెడ్డి, ఎఫ్‌డిఒ రవికుమార్, మత్స్యకార ఎఫ్‌పిఒ అధ్యక్షుడు గంతి శ్రీనివాసరావు, విఎఫ్‌ఎ కృష్ణారావు, ముబీన్, విఆర్‌ఒ వీరేంద్ర, శేఖర్, సొసైటీ సభ్యులు, సాగర మిత్రలు పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బ్రాహ్మణతర్లా విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- పలాస

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మోహన్ కంద ఆధ్వర్యాన హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే వారధి ఫౌండేషన్ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జూమ్ ద్వారా బుధవారం నిర్వహించిన వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని బ్రాహ్మణతర్లా హైస్కూల్ పదో తరగతి విద్యార్థులు బి.చార్మిల, జి.తనూష, పి.బాలకృష్ణ సంయుక్తంగా కన్సలేషన్ బహుమతిని సాధించారు. నేషనల్ క్రికెట్ అకాడమీ చైర్మన్, మాజీ క్రికెటర్ వి.వి.ఎస్.లక్ష్మణ్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వి.విజయ రామరాజు, సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు సమక్షంలో విజేతలు వివరాలు వెల్లడించారు. త్వరలోనే నగదు బహుమతిని విద్యార్థుల బ్యాంకు ఖాతాలో జమచేసి, ప్రశంసాపత్రాలను పాఠశాల చిరునామాకి పంపిస్తామని తెలియజేశారు. అలాగే విజన్ స్వర్ణాంధ్ర-2047లో భాగంగా జిల్లాస్థాయిలో నిర్వహించిన డిబేట్‌లో ఎస్.ప్రణతి ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర పోటీలకు అర్హత సాధించింది. విద్యార్థులకు పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు కొయ్యల శ్రీనివాసరావు, గైడ్ టీచర్‌గా వ్యవహరించారు. వీరిని ప్రధానోపాధ్యాయులు ఎస్.వి.రమణారావు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

పలాస ఆర్‌డిఒకు అస్వస్థత

పలాస : పలాస ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ బి.సుదర్శనదొర బుధవారం మధ్యాహ్నం విధులు నిర్వహిస్తున్న సమయంలో తన సీటులో ఉన్నట్లుండి కుప్పకూలిపోయి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. సిబ్బంది హుటాహుటిన కాశీబుగ్గలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం హుటాహుటిన తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. మెదడకు సంబంధించిన వ్యాధితో ఆయన బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని ఇంకా ధ్రువీకరించాల్సి ఉంది. శ్రీకాకుళం డెప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన. ఈ నెల 7న ఆయన పలాస ఆర్‌డిఒగా ఇన్‌ఛార్జిగా బాధ్యతలు తీసుకున్నారు. మధ్యాహ్నం ముఖ్య పత్రాలు పరిశీలిస్తున్న క్రమంలో తలనొప్పి కొడతుందని అటెండర్ దిలీప్‌కుమార్ చెప్పడంతో ఆయన సపర్యలు చేశారు. అనంతరం నొప్పి కుద టపడిందనుకన్న సమయానికి ఆయన ఒక్కసారిగా తన సీటునుంచి కిందకు కుప్పకూలి పోయారు. తహశీల్దార్ కళ్యాణచక్రవర్తి, సిబ్బంది ఆస్పత్రికి చేరుకొని పరిస్థితిని కలెక్టర్‌కు సమాచారం అందజేశారు.

ఆస్పత్రికి తీసుకెళ్తున్న సిబ్బంది

హిట్ అండ్ రన్ కేసుల్లో త్వరితగతిన పరిహారం

మాట్లాడుతున్న సన్యాసినాయుడు

శ్రీకాకుళం అర్బన్ : సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ స్కీం ద్వారా లభించే నష్ట పరిహారం బాధితులకు సకాలంలో అందజేయాలని కమిటి కన్వీనర్ ఆర్.సన్యాసినాయుడు అన్నారు. జిల్లా కోర్టులో హిట్‌అండ్‌రన్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. జిల్లాలో హిట్‌అండ్‌రన్ కేసుల వివరాలను సంబంధిత అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న వాటిని సత్వరమే పరిష్కరించుకునేందుకు వీలుందన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ అప్పారావు, దిశ డిఎస్‌పి రాజశేఖర్ పాల్గొన్నారు.

సాగునీరు అందించేందుకు చర్యలు

బూర్జ : మండలంలోని అల్లెన పంచాయతీ పరిధిలోని భూములకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు నీటిపారుదల శాఖ డిఇఇ కామరాజు బుధవారం తెలిపారు. ఈ పంచాయతీకి చెందిన రైతులు స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు తమ పొలాలకు సాగునీరు అందడం లేదని లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలని కోరడంతో తాము పరిశీలించడానికి వచ్చినట్లు తెలిపారు. ఇక్కడ పరిస్థితులను ఎమ్మెల్యేకు నివేదిక అందజేయడం జరుగుతుందన్నారు. ఆయనతో పాటు శ్రీనివాసరావు, సచివాలయ సర్వేయర్ మోహన్, టిడిపి మండల అధ్యక్షులు వావిలపల్లి రాంజీ, రాంబాబు, గోవిందరావు, ఆంజనేయులు, రైతులు ఉన్నారు.

నీలమణి ఆలయం హుండీ లెక్కింపు

పాతపట్నం : స్థానిక నీలమణి దుర్గ ఆలయ ప్రాంగణంలో బుధవారం హుండీని లెక్కించారు. దసరా నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా 15 రోజులకు రూ.4,78,133 ఆలయం వచ్చిందని ఆలయ ఇఒ తెలిపారు. హుండీ లెక్కింపు పర్యవేక్షణకు సహాయ కమిషనర్ కార్యాలయం నుంచి జివిబిఎస్ రవికుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో టి.వాసుదేవరావు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ఆదాయాన్ని లెక్కిస్తున్న అర్చకులు

ఎఇ బాధ్యతల స్వీకరణ

కవిటి: కవిటి విద్యుత్‌శాఖ ఎఇగా యు.శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇన్‌ఛార్జి ఎఇగా బాధ్యతలు నిర్వర్తించిన నేతాజీ కొత్త ఎఇకి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛంతో సాదర స్వాగతం పలికారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎఇ శ్రీనివాసరావు

ఇసుక నిల్వలు సీజ్

శ్రీకాకుళం అర్బన్ : మండల పరిధిలోని రాగోలు వద్ద శ్రీ వేంకటేశ్వర ఇండస్ట్రీస్ ఆవరణలో సర్వే నెంబరు 45/1పిలో 378.582 క్యూబిక్ మీటర్ల నిల్వ ఉంచిన అక్రమ ఇసుకను రెవిన్యూ, పోలీసు అధికారులు గుర్తించారు. అలాగే జెఎన్‌టి వెడ్డింగ్ ఈవెంట్స్ షెడ్ ఆవరణలో 53.20 క్యూబిక్ మీటర్ల ఇసుకను సీజ్ చేశారు. వీటితో పాటు జెమ్స్ ఆస్పత్రి వెనుక జగనన్న కాలనీకి సమీపాన 21 క్యూబిక్ మీటర్లు, 15.27 క్యూబిక్ మీటర్లు, 19.84 క్యూబిక్ మీటర్లు, 54 క్యూబిక్ మీటర్లు మొత్తం 541.892 క్యూబిక్ మీటర్ల ఇసుకను సీజ్ చేశారు. వీటిని తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను కూడా రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బహుమతులను అందజేస్తున్న ఆర్గనైజేషన్ సభ్యులు

'విశాఖ'లో వ్యాసరచన పోటీలు

శ్రీకాకుళం అర్బన్ : డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం జన్మదిన వేడుకల్లో భాగంగా నగరంలోని విశాఖ హైస్కూల్‌లో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా 6 నుంచి 10వ తరగతి పిల్లలకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్టు ఆర్గనైజేషన్ అధ్యక్షులు సద్గుణ తెలిపారు. ఈ పోటీల్లో పదో తరగతి విద్యార్థిని మాలతి మొదటి బహుమతి గెలుపొందిందన్నారు. ప్రతిఒక్కరూ కలాం జీవిత చరిత్రను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. హెచ్ఎం మాట్లాడుతూ జియో గ్లోబల్ ఆర్గనైజేషన్ సేవలు విస్తృతం కావాలని, పేద విద్యార్థుల కోసం ఈ ఆర్గనైజేషన్ పని చేస్తుండటం గొప్ప విషయమన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలను, బహుమతులను సభ్యులు అందజేశారు. కెరీర్ ఫెయిర్ సాయిబాబా, మణిశర్మ, ఆర్గనైజేషన్ జనరల్ సెక్రెటరీ స్వరూప్, ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ సద్గుణ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

పలాస : కాశీబుగ్గలో శుక్రవారం ఉదయం పది నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.యగ్నేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. చినబాడం ఫీడర్‌పై నూతన స్తంభాల వేస్తున్న కారణంగా పెంటిభద్ర, జయరామచంద్రపురం, పద్మనాభపురం కాలనీ, పాత జాతీయ రహదారి, అంబుసోలి, తాళ్లభద్ర ప్రాంతాల్లో నిలుపుదల చేస్తున్నామని తెలిపారు.

వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలి

మాట్లాడుతున్న శ్రీనివాస్

ప్రజాశక్తి- సోంపేట

విలేకరులు వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవడం ద్వారా మరింత మెరుగ్గా రాణించగలరని సిఐటియు సీనియర్ నాయకులు కె.శ్రీనివాస్ అన్నారు. సోంపేట మండలం బారువాలోని హరితా రిసార్ట్స్‌లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజాశక్తి శ్రీకాకుళం ఎడిషన్ మేనేజర్ పి.కామినాయుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్.లక్ష్మీనారాయణ, చిరంజీవి, కృష్ణారావు మాస్టర్, సమన్వయ కమిటీ సభ్యులు ఎ.సోమశేఖర్, జి.లక్ష్మణరావు, టి.భీమారావు, టి.బుజ్జిబాబు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం పెద్దమడి బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ఆయన మాట్లాడుతూ బాగా చదువుకోవాలని సూచించారు. పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దసరా సెలవుల అనంతరం ఇళ్ల నుంచి పాఠశాలకు విద్యార్థులు త్వరితగతిన వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ

పాఠశాల నిర్మాణం పూర్తి చేయాలి

మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ పాఠశాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం పాఠశాల భవన నిర్మాణ పనులను పిఒ పరిశీలించారు. ఈ సందర్భంగా పెండింగ్ పనులను వేగవంతం చేయాలన్నారు. పనుల్లో నాణ్యత లోపించ కూడదన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

శిలా'ఫలకం' ఏదీ?

ప్రజాశక్తి- పలాస

పల్లె పండగ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఆదేశించారు. కానీ, ఆ గ్రామంలో కూటమి నాయకులతో పాటు అధికారులు భూమి పూజ చేసి శిలాఫలకం వేయకుండా మమానిపించారు. మండలంలోని బ్రాహ్మణతర్లాలో బుధవారం పల్లె పండగ కార్యక్రమంలో రూ.12.60 లక్షల వ్యయంతో సిసి రోడ్ల నిర్మాణానికి టిడిపి నాయకులతో పాటు అధికారులు శంకుస్థాపన చేశారు. కానీ, శిలాఫలకం లేకపోవడం విశేషం. అధికారుల నిర్లక్ష్యం, టిడిపి నాయకుల అనాలోచిత నిర్ణయాలతో శిలాఫలకం వేయని పరిస్థితి నెలకొంది. అయినా అధికారులు, నాయకులు శిలాఫలకం లేకుండా శంకుస్థాపన చేయడంతో గ్రామంలో చర్చనీయాంశమైంది. స్థానికుల నాయకుల పేర్లు లేకపోవడంతో ఫలకాన్ని వేయలేదని తెలుస్తోంది. ఈ విషయంపై ఎంపిడిఒ వసంతరావుకు వివరణ కోరగా... ఫలం వేయకపోవడం వాస్తవమేనని, రెండు రోజుల్లో ఏర్పాటు చేస్తామని తెలిపారు.

అంగన్వాడీలకు శిక్షణ

ప్రజాశక్తి- పలాస

పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో పనిచేస్తున్న అంగన్వాడి కార్యకర్తలకు ప్రకృతి వ్యవసాయం, కిచెన్ గార్డెన్ నిర్వహణపైన ప్రకృతి వ్యవసాయస సిబ్బంది స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో బుధవారం శిక్షణ ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయం వల్ల ఉపయోగాలు, ఘన ద్రవ జీవమృతాలు, నిమాస్త్రము, సూర్య మండలము, ఎటిఎం మోడల్స్‌పైన శిక్షణ ఇచ్చారు. కిడ్నీ ఆస్పత్రికి సంబంధించిన వారు కిడ్నీ సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కార్యక్రమంలో ఇసిఇ కో-ఆర్డినేటర్ శివాజీ తెలియజేశారు. కార్యక్రమంలో సిడిపిఒ పార్వతి, సూపర్‌వైజర్లు, మాస్టర్ ట్రైనర్ పి.సంజీవరావు, ఎన్‌డిఎ నాగరాజు, లక్ష్మణరావు, కూర్మారావు, గంగమ్మ, దానమ్మ, అరుణ పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న శివాజీ

నట్టల నివారణ మందులు వేయించాలి

ప్రజాశక్తి- లావేరు

గొర్రెలు, మేకలు తదితర జీవాలకు నట్టల నివారణ మందులు తప్పనిసరిగా వేయించాలని, పెంపకందారులు జాగ్రత్తలు తీసుకోవాలని పశు సంవర్ధక డిప్యూటీ జెడి పాలిటి రామ మోహనారావు అన్నారు. మండలంలోని బుడుమూరులో నట్టల నివారణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెలు, మేకలు బరువుగా పెరగాలన్నా, పారుడు, వివిధ రోగాలు, అంటు వ్యాధులు రాకుండా సకాలంలో రైతులు నట్టల నివారణ మందులు తాగించాలన్నారు. ఈ డ్రైవ్ ఈనెల 16 నుంచి 31 వరకు కొనసాగుతుందని తెలిపారు. మండలంలో 39వేల గొర్రెలు, మేకలు ఉన్నాయన్నారు.

లావేరు : గొర్రెకు నట్టల నివారణ మందు వేస్తున్న రామమోహనరావు

కార్యక్రమంలో ఎడి బి.దుర్గారావు, లావేరు, బెజ్జిపురం, బుడుమూరు, కేశవరాయపాలెం పశువైద్యులు హేమంత్ కుమార్, గాయత్రి, లావణ్య, అసిస్టెంట్లు రాజేశ్వరి, మణికంఠ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: మండలంలోని ఎల్‌పిఎం అగ్రహారంలో సామూహిక నట్టల నివారణ కార్యక్రమంలో భాగంగా గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును పశువైద్యాధికారి డి.సతీష్‌కుమార్ వేశారు. 334 గొర్రెలకు, 57 మేకలకు నట్టల నివారణ మందును వేసి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి నందివాడ గోవిందరావు, మాజీ ఎంపిటిసి చిన్నాల అప్పారావు, అరసవెల్లి సన్యాసిరావు, సచివాలయ పశు వైద్య సహాయకుడు మూకళ్ల మోహన్, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

పోషక యాజమాన్యంపై శిక్షణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో సమగ్ర పోషక యాజమాన్యంపై మేనేజ్, సమితి ఆర్థిక సౌజన్యంతో వ్యవసాయ సహకార సంఘ ప్రతినిధులకు 15 రోజుల సర్టిఫికెట్ కోర్సును వ్యవసాయశాఖ జెడి త్రినాథస్వామి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కెవికె ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి 30 వరకు 15 రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని ప్రాథమిక సహకార సంఘ సభ్యులు వినియోగించుకోవాలని కోరారు. రైతులు ఎరువుల డీలర్లుగా మారడానికి ఈ శిక్షణా కార్యక్రమం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. రసాయన ఎరువులతో పాటు సేంద్రియ ఎరువులను కూడా వ్యవసాయంలో వినియోగిస్తే పర్యావరణం కలుషితం కాకుండా మానవాళి ఆరోగ్యం దెబ్బతినకుండా ఉంటుందని వివరించారు. అనంతరం వ్యవసాయ శాఖ జెడి త్రినాధ స్వామి మాట్లాడుతూ జిల్లాలో ఎరువుల వినియోగం బాగా ఎక్కువైందని, సమతుల్య ఎరువుల యాజమాన్యం ఎవరూ సరిగా చేయడం లేదన్నారు. సమతుల్యంగా ఎరువుల యాజమాన్యం చేయకపోతే పంటకు నష్టం వాటిల్లే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ఎరువుల వాడకంలోని మెలకువలు, పోషక లోపాలు, నివారణ చర్యలను ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా అందరూ తెలుసుకొని రైతు సోదరులకు ఉపయోగపడే విధంగా అవగాహన కల్పించవచ్చని వివరించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్, డాక్టర్ సిహెచ్ బాలకృష్ణ, డాక్టర్ జి.చిట్టిబాబు, డాక్టర్ అనూష, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, శ్రీకాకుళం జిల్లా ప్రాథమిక సహకార సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

సూరి మృతదేహం

లారీ ఢీకొని ట్రాక్టర్ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని జాతీయ రహదారి బుడుమూరు కూడలిలో బుధవారం ట్రాక్టర్‌ను లారీ ఢీకొనడంతో ట్రాక్టర్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. లావేరు పోలీసుల కథనం మేరకు పొందూరు మండలం నరసాపురం గ్రామానికి చెందిన ఆవాల సూరి (45) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. జాతీయ రహదారిపై గార్డెనింగ్ పనులు చేస్తున్నారు. అక్కడ మెట్టరియల్‌ను ట్రాక్టర్‌లో తరలించేందుకు సూరి రహదారిపై ట్రాక్టర్‌ను నిలుపుదల చేశాడు. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు ట్యాంకర్ లారీ అతివేగంతో నిర్లక్ష్యంగా లారీని నడుపుతూ ట్రాక్టర్‌ను బలంగా ఢీకొనడంతో ట్రాక్టర్‌పై డ్రైవర్ సీటులో ఉన్న సూరికి బలమైన గాయాలు తగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడుకి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబాన్ని పెంచే పెద్దదిక్కు కోల్పోవడంతో వారు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఎస్ఐ గదుల లక్ష్మణరావు ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరణ చేసి శవ పంచనామ నిర్వహించి మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. లారీని నిర్లక్ష్యంగా నడిపిన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎసఐ తెలిపారు.

గాయపడిన వ్యక్తి దుర్మరణం

పలాస : ఈనెల 12న పట్టణంలోని సీతారాంనగర్ వీధికి చెందిన తిప్పన మురళి (36) తన బైక్‌పై గొప్పిలి బంధువులు ఇంటికి వెళ్లి తిరిగి సాయంత్రం తన ఇంటికి పలాస వస్తున్నాడు. మండలంలోని అల్లుకోల వద్ద అదుపు తప్పి బోల్తా పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకు జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. మృతుడుకు భార్య ధనలక్ష్మి, కుమారు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కాశీబుగ్గ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ఫిర్యాదుదారునిపై దాడి

శ్రీకాకుళం అర్బన్: నగరానికి సమీపాన రాగోలు నుంచి దూసి రోడ్డు, జెమ్స్ ఆస్పత్రి వెనుక అక్రమంగా ఇసుక నిల్వలు ఉన్నాయని జెసి ఫర్మాన్ అహ్మద్‌కు ఫిర్యాదు చేసిన ఆమదాలవలస నియోజకవర్గం గుత్తావల్లికి చెందిన సనపల సురేష్ (రాము)పై బుధవారం సాయంత్రం మూకుమ్మడి దాడి చేశారు. ఈ నెల 15న రాగోలు పరిధిలో అక్రమంగా ఇసుక నిల్వలు ఉన్నాయని సురేష్ ఫిర్యాదు చేశారు. ఎప్పటినుంచో ఆమదాలవలస నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ఇసుక అక్రమ దందాలపై సురేష్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తునే ఉన్నాడు. ఈ నేపథ్యంలోనే గత నెల 27న సురేష్‌పై దాడి జరగడంతో బాధితుడు పోలీసులకు అదేరోజున ఫిర్యాదు చేశాడు. రాజకీయ కారణాలతో పోలీసులు ఈ ఫిర్యాదును విస్మరించారు. రాగోలు, జెమ్స్ ఆస్పత్రి వెనుక ఇసుక నిల్వలు ఉన్నాయని మళ్లీ ఫిర్యాదు రావడంతో రెవెన్యూ, పోలీసు అధికారులు దాడులు నిర్వహించి, ఇసుకను సీజ్ చేశారు. అయితే సురేష్ ఇసుక సమాచారాన్ని అధికారులకు అందజేశాడని భావించిన ముఠా సభ్యులు బుధవారం సాయంత్రం కొత్త రోడ్డులో దారి కాచి సురేష్ కారును అడ్డగించి దాడికి ప్రయత్నించారు. వారి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో సురేష్ వారి మీదుగా వాహనాన్ని పోనిచ్చారు. గుంపులో ఉన్న పురుషోత్తపురానికి చెందిన సాయి, సరుబుజ్జిలికి చెందిన ధనుంజయ, తుంగపేటకు చెందిన అశోక్‌కుమార్‌లు గాయపడ్డారు. దీంతో ఆగ్రహించిన అక్రమ ఇసుక వాటాదారులు సురేష్‌ను వెంబడించారు. బలగ-ఆర్‌టిసి కాంపెక్స్ రోడ్డులో ఆయన వాహనాన్ని అడ్డగించి దాడికి ప్రయత్నించారు. ఆ సమయంలో టూటౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని బాధితుడు సురేష్‌ను రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సురేష్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

యువకునిపై కత్తితో దాడి

శ్రీకాకుళం అర్బన్ : ఓ యువకుడిపై మరో యువకుడు కత్తితో దాడి చేసిన ఘటన నగరంలోని దమ్మల వీధిలో చోటు చేసుకుంది. రిమ్స్ అవుట్ పోస్ట్ పోలీసులు అందించిన వివరాల మేరకు దమ్మలవీధికి చెందిన సతీష్‌పై అదే ప్రాంతానికి చెందిన ప్రసాద్ బుధవారం కత్తితో దాడి చేశాడు. ఇటీవల వీరిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 2న ఓ ఫంక్షన్‌లో డిజె ఏర్పాటు చేశారు. అక్కడ వీరిద్దరు గొడవ పడ్డారు. ఆ సమయంలో సతీష్ తండ్రిపై కూడా ప్రసాద్ దాడికి యత్నించాడు. గొడవ పెద్దది కాకుండా ఉండేందుకు వీధిలో ఉన్న పెద్దలు ప్రయత్నించారు. ఇరువర్గాలను బుధవారం పిలిపించి మాట్లాడి వ్యవహారాన్ని కొలిక్కి తేవాలని భావించారు. అందులో భాగంగా దమ్మలవీధిలో పెద్దల సమక్షంలో పంచాయతీ జరుగుతుండగానే సతీష్‌పై ప్రసాద్ కత్తితో దాడి చేశాడు. ఘటన జరిగిన తరువాత మిత్రుడి ద్విచక్ర వాహనంపై వన్ టౌన్‌కి వెళ్లి పోలీసుల ఎదుట ప్రసాద్ లొంగిపోయాడు. ఈ వివాదానికి గంజాయి మూలాలు ఉండడంతో పోలీసులు అప్రమత్త మయ్యారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు నుంచి జారిపడి విద్యార్థికి గాయాలు

ఆమదాలవలస : పురపాలక సంఘంలోని ఒకటవ వార్డు పరిధిలోని జగ్గుశాస్త్రులపేట వద్ద ఆర్‌టిసి బస్సు నుంచి విద్యార్థి జారిపడి గాయపడ్డాడు. ఈ ప్రమాదంపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సిఎస్‌పి రహదారిపై విద్యార్థులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ప్రతిరోజు జిల్లా కేంద్రమైన శ్రీకాకుళంలోని వివిధ కళాశాలలకు వెళ్లటానికి కావాల్సిన బస్సులు లేకపోవడం ఆర్‌టిసి అధికారుల నిర్లక్ష్యంపై నినాదాలు చేస్తూ విద్యార్థులు రోడ్డుపై బైఠాయించారు. పాలకొండ నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న పల్లె వెలుగు బస్సులో కొంతమంది విద్యార్థులు కళాశాలకు చేరుకోవడానికి ప్రయాణిస్తున్న సమయంలో బస్సు పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తుండడంతో కొంతమంది విద్యార్థులు బస్సు ఫుట్ బోర్డుపై నిలబడుతూ ప్రయాణానికి ఉపక్రమించారు. బస్సు జగ్గుశాస్త్రులపేట వద్దకు వచ్చే సమయంలో ఒక విద్యార్థి జారిపడి రోడ్డుపై పడడంతో గాయాల పాలయ్యాడు. దీంతో విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ బస్సులో ఉన్న విద్యార్థులతో పాటు వివిధ వాహనాలపై వచ్చిన విద్యార్థులు కూడా అదే ప్రాంతంలో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సంఘటనతో సిఎస్‌పి రహదారిలో సుమారు 40 నిమిషాలు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో రహదారికి ఇరువైపులా వాహనాలు బారులు తీరాయి. కొద్ది సేపటి తరువాత విద్యార్థులు ఆందోళన విరమించారు. పాలకొండ, శ్రీకాకుళం విద్యార్థుల ప్రత్యేక బస్సు ఉండేదని దానిని ఇటీవల ఆర్‌టిసి అధికారులు పూర్తిగా రద్దు చేయడంతో విద్యార్థులు గమ్యస్థానానికి చేరుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. పల్లె వెలుగు బస్సులు ఈ రహదారిలో అరకొరగా ఉండడంతో కళాశాలకు వెళ్లే సమయం దాటుతుందని, ఆందోళనలో ప్రాణాలకు తెగించి ప్రయాణం చేయాల్సి వస్తుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, జిల్లా ఆర్‌టిసి అధికారులు తమ ఆవేదనను గ్రహించి కళాశాల సమయాలకు అనుకూలంగా బస్సులను నడపాలని వారు కోరారు.

సుడిదోమపై అప్రమత్తం

కవిటి : రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ దుర్గాప్రసాద్

ప్రజాశక్తి- కవిటి

ప్రస్తుతం వరి చేలో దోమపోటు కనిపిస్తోందని, దీని ప్రభావం వల్ల పంటచేలు మొదట్లో పసుపుగా మారి, చేని గుండ్రని సుడులు తిరిగిపోతుందని ఎఒ బడగల దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని కరాపాడులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాట్లాడుతూ దోమపోటు నివారణకు దోమ తీవ్రతనుబట్టి పైమిత్రోజైన్, డైనోఫ్యూరిన్ కలిపి ఎకరానికి 130 గ్రాములు చల్లుకోవాలని, అదేవిధంగా పొడ తెగులు నివారణకు ఎకరా పొలంలో హెక్సకోనజోల్ 400ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. అలాగే రెండో పంటకు అనుకూల మైన నువ్వులు, రాగులు విత్తనాలు సబ్సిడీ ద్వారా అందిస్తామని రైతులు వాటిని వినియోగించుకోవాలని సూచించారు. వ్యవసాయ సహాయకులు అమూల్య, రైతుల పిట్ట తులసయ్య, రేలంగి, బాగుత వాసు పాల్గొన్నారు.

ఆమదాలవలస : కార్యక్రమంలో పాల్గొన్న ఎఒ మోహనరావు

నందిగాం : మండలంలోని వేణుగోపాలపురంలో ఎఒ పి.శ్రీకాంత్‌వర్మ పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు బి.వామనమూర్తి పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని పెద్దపద్మాపురం, సిరియాఖండి గ్రామాల్లో ఎఒ దానకర్ణుడు పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ప్రతినిధులు శ్రీధర్, రామరాజు, భాస్కరావు, వసంతరావు, ఎల్లంనాయుడు, రామారావు, సోమేశ్వరరావు, ఝూనీ, పుష్ప పాల్గొన్నారు.

కోటబొమ్మాలి: దోమపోటుపై రైతులు అప్రమత్తం కావాలని మండల ఎఒ ఎస్.గోవిందరావు అన్నారు. మండలం ఎత్తురాళ్లపాడులో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : మండలంలోని నెల్లిపర్తి రైతు సేవా కేంద్రంలో ఈ పంట నమోదు చేసుకున్న రైతుల జాబితాను మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు బుధవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 23 రైతు సేవా కేంద్రాల్లో ఈ పంట జాబితాను సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించడం జరిగిందని తెలిపారు. మండలంలోని రైతులు ఈ పంట నమోదు చేసిన వివరాలను పరిశీలించి ఏమైనా తప్పులు ఉన్న యెడల గ్రీవెన్స్ పెట్టుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా నెల్లిపర్తిలో గ్రామసభ, ఈ పంట వివరాల సామాజిక తనిఖీలో రైతులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని పంట పొలాలను పరిశీలించారు. రైతులు క్షేత్ర స్థాయిలో తెగుళ్ల (కుళ్ళు తెగులు) చీడ పీడల (సుడి దోమ, ఆకు ముడత) తదితర తెగుళ్లపై చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులతో చర్చించారు. కార్యక్రమంలో రైతులు శెట్టి నరసింగరావు, దేశిలంక రమణ, మామిడి చిన్నారావు, రాజేష్, పడాల అచ్యుత్, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ పేడాడ సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : రైతులకు సూచనలిస్తున్న ఎఒ గోవిందరావు

పొందూరు: వరి పంటకు సోకే సుడిదోమపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎఒ బెండి బాబ్జి అన్నారు. మండలం రాపాకలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరిసాగులో అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ధనలక్ష్మి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పొందూరు : రైతులకు సూచనలు చేస్తున్న ఎఒ బాబ్జీ

జెండాను ఆవిష్కరిస్తున్న రాజు

జనసేన జెండా ఆవిష్కరణ

ఇచ్ఛాపురం : మండలం బూర్జిపాడు పంచాయతీ పెద్దలక్ష్మీపురంలో జన సైనికుల సహాయంతో పులకల తులసీరావు ఆధ్వర్యాన బుధవారం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దుర్యోధన రెడ్డి జనసేన జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకారశాఖ కార్యదర్శి నాగుల హరి బెహరా, కర్రి నాగరాజు, జాని, రొక్కల భాష్కర్, జోగారావు, వల్లభ, శేఖర్, పరశుశురాం, యోగి, మధు, తారకేష్, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సదస్సును విజయవంతం చేయాలి

పలాస: విజయవాడలో ఈ నెల 18న నిర్వహిస్తున్న ఐఎఫ్‌టియు రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని జిల్లా కమిటీ నాయకులు పోతన్నపల్లి మల్లేశ్వరరావు, బర్ల గోపి పిలుపునిచ్చారు. పలాస-కాశీబుగ్గ ఆటో స్టాండ్‌లో సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు గోరకల బాలకృష్ణ, చెల్లూరు భైరాగి, ఆటో యూనియన్ నాయకులు కోనారి వల్లభరావు, మద్దిల పాపారావు, సుబుద్ధి మురళి పాల్గొన్నారు.

20న విశాఖలో గద్దర్ సభ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మట్టి మనుషలను తట్టిలేపిన ప్రజా యుద్ధ నౌక గద్దరన్నను స్మరించుకుంటూ ఈ నెల 20న విశాఖపట్నం పౌరగ్రంథాలయంలో సభ నిర్వహిస్తున్నట్టు బహుజన నేతలు బోకరి నారాయణరావు, చల్లా రామారావు, పాటలతూటా ఉదయ భాస్కర్ తెలిపారు. ఈ మేరకు స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గద్దర్ జీవితమంతా పోరాటాలకు ముందు నడిచారని అన్నారు. కార్యక్రమంలో సుంకు గోపినాథ్, అక్కురాడ లోకనాథం, ఆట్ల రాహుల్ కుమార్, శ్రీను, మాధవరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రం సందర్శన

ఆమదాలవలస: మండలంలోని నిమ్మ తొర్లాడలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుంచి వచ్చిన అటల్ భూ జల్ బృందం ప్రకృతి వ్యవసాయంలో సాగు చేస్తున్న చెరకు పంట ను సందర్శించారు. ఈ క్షేత్ర సందర్శనకు ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర విభాగం నుంచి కృష్ణారావు, రీజనల్- కోఆర్డినేటర్ హేమసుందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పర్యటనకు వచ్చిన బృంద సభ్యులు చెరకు నుంచి బెల్లం తయారీని పరిశీలించారు. రాష్ట్ర విభాగం నుంచి వచ్చిన కృష్ణారావు, హేమసుందర్ ఉత్తరప్రదేశ్ బృందానికి ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎన్ఎఫ్ఎస్ శివ, శ్రీనివాస్, సూర్యనారాయణ, రమణ, పెంటయ్య, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న హేమసుందర్

ఆశ్రమ పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో దోనుబాయి గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సీతంపేట ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ పి.నారాయుడు బుధవారం సందర్శించారు. 310 మంది విద్యార్థులకు గాను 190 మంది విద్యార్థులు ఉండటాన్ని ఆయన గుర్తించారు. మిగతా విద్యార్థులంతా సాయంత్రానికల్లా చేరేలా చూడాలని ఉపాధ్యాయ సిబ్బందికి ఆదేశించారు. గ్రామాల్లోకి కొంతమంది ఉపాధ్యాయులను పంపించి విద్యార్థులను రప్పించాలని సూచించారు. అనంతరం విద్యార్థుల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాన్ని పరిశీలించారు. పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయేంద్ర, ఆర్‌సి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హాజరు శాతం పెంచాలి

పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబు అన్నారు. మండలంలోని పెద్దపొల్ల ఆశ్రమ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. విద్యార్థుల కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేసి సాధారణ వైద్య పరీక్షలు చేయాలని సూచించారు. పాఠశాలలో భోజన మెనూ పరిశీలించారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తరగతి గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు రవి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పల్లె పండగ

ప్రజాశక్తి- వీరఘట్టం

మండలంలోని కత్తులకవిటి, ఎం.రాజపురం గ్రామాల్లో బుధవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. తోటపల్లి ప్రాజెక్టు మాజీ ఛైర్మన్ నిమ్మక పాండురంగ ఇంకుడు గుంతకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నిమ్మక రవణమ్మ, జెడ్‌పిటిసి జంపు కన్నతల్లి, ఉమామహేశ్వరరావు, మాజీ ఎంపిటిసి రౌతు రంగారావు, పంచాయతీరాజ్ జెఇ డి.కళ్యాణదుర్గ, ఎపిఒ జి.సత్యంనాయుడు, రౌతు కృష్ణంనాయుడు, జి.గౌడ్‌నాయుడు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

సమావేశంలో మాట్లాడుతున్న డిసిసిబి సిఇఒ వరప్రసాద్

ప్రజాశక్తి- ఆమదాలవలస

సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డిసిసిబి సిఇఒ డి. వరప్రసాద్ అన్నారు. బుధవారం పురపాలక సంఘం పరిధిలోని 7వ వార్డు చింతాడలో స్వయం సహాయక సంఘ సభ్యులకు యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరు పొదుపు ప్రాముఖ్యతను తెలుసుకొని పొదుపు చేయాలని మహిళలకు సూచించారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని ఎవరైనా ఫోన్ చేసి ఎటిఎం పిన్ కార్డు వివరాలు అడిగితే అటువంటి వారికి వివరాలు చెప్పవద్దన్నారు. ఎటిఎం కార్డు వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. నగదు రహిత లావాదేవీలను కొనసాగించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణ డిసిసిబి బ్యాంక్ మేనేజర్ సంధ్యారాణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన పథకాన్ని 18 నుంచి 50 ఏళ్లలోపు వారికి వర్తిస్తుందని, ఏడాదికి రూ.436 ప్రీమియం చెల్లించాలని తెలిపారు. ఎవరైనా సహజ మరణం పొందితే అటువంటి వారికి రూ.2 లక్షలు బీమా వర్తిస్తుందని తెలిపారు. అలాగే ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకంపై వివరించారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్మెన్ టోల్ ఫ్రీ నెంబర్ 14448 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిఒ నాగమణి, జిల్లా డిసి ఎ.హరనాథ్, సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్లు చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను), రామారావు, స్వయం సహాయక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- రణస్థలం

మండల కేంద్రంలో సూర్య ఆస్పత్రి వద్ద జిల్లా అంధత్వ నివారణా సంస్థ సౌజన్యంతో ఇడదాసుల విద్యా ఆరోగ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వారిచే ఉచిత నేత్ర వైద్య శిబిరం, సూర్య ఆస్పత్రి వైద్యులు యశ్వంత్ ఉచిత బిపి, షుగర్, గుండె జబ్బుల స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. ఈ శిబిరాలను ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు ఇడదాసుల వెంకట సత్యన్నారాయణ ప్రారంభించి మాట్లాడుతూ శంకర్ ఫౌండేషన్, సూర్య ఆస్పత్రి సహకారంతో సేవా ఫౌండేషన్ గత కొంత కాలంగా ఎన్నో వైద్య శిబిరాలను నిర్వహించిదని, ఇలాంటి వైద్య శిబిరాల ద్వారా పేదలకు మెరుగైన వైద్యాన్ని అందించడమే ఫౌండేషన్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మెడికవర్ ఆస్పత్రి వైద్యులు ఫణి తేజ, సేవా ఫౌండేషన్ అధ్యక్షులు తిరుపతి రాజు, సభ్యులు బలివాడ శ్రీనివాస రావు, బేతా నర్సింహులు, శంకర్ ఫౌండేషన్ వైద్యులు, సిబ్బంది, సూర్య ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది